# కృష్ణవేణి కోపం

రచన :
"శార్వాణి"

కొండమీదనుంచి పెద్ద శబ్దం విన్పించింది. ప్రకృతి గజగజ వణికిపోయింది. ధారాపాతంగా నీరు శిలావిగ్రహముమీదనుంచి దిగజారుతోంది పల్లాన్ని వెతుక్కుంటూ. ఎత్తునుంచిజారే జలపాతం పరవళ్ళు తొక్కుతోంది. వడి వడిగా వెడలిపోతోంది.

సన్నగాదారి, మిన్నగామారి, నడిచే ప్రవాహం పొడవయింది. ఒక కొండనుంచి మరొక కొండ పొర్లి పడుతున్నా దారి సన్నబడలేదు.

సన్నని ప్రవాహం, వెడల్పయి, విశాలమై, పల్లానికి దారి చూచుకుంటోంది. వేగాన్ని హెచ్చిస్తోంది. వికటట్టహాసంచేస్తూ వికృతంగా, పకృతిమీదకు దండయాత్ర సాగిస్తోంది.

అర్ధరాత్రి....అంధకార బంధురం. చీకటి గుయ్యారంలో కాలం కోక కప్పుకొని లోకం కనుమూసింది. మబ్బులు చుట్టిన ఆకాశం ముమ్మరంగా మంచుతెరలను అవనికి అందిస్తోంది.

కనకదుర్గ గుడిలో దీపం మిణుకు మిణుకు మంటోంది. గాలికి గంటలు సన్నగా మ్రోగుతున్నాయి. కొండమీద చెట్ల కొమ్మలు రోదిస్తున్నాయి.

ప్రవాహం తగ్గలేదు. తరంగాలు తరలలేదు.

లోకం గుర్రుపెట్టి నిద్రోతోంది.
కాలం కనిపెట్టుకొని చూస్తోంది.
పాపం అంతం కాబోతోంది.

ప్రవాహం వరద రూపం ధరించింది. ఉప్పొంగుతూ, ఉవ్వెత్తున లేస్తూ, పెరుగుతూ, రెచ్చిపోతూ, కట్టను కాటువేయబోయింది. పెద్దకట్ట : పొడుగ్గా నదిఒడ్డు నానుకొని నిలబడివుంది. తరంగాలు కట్టతో కలయబడ్డాయి. కట్టను పగలకొట్టి, లోకంలో కాలుపెట్టాలని తహ తహలాడుతోంది. బరువైన ప్రవాహం. కట్ట సాయశక్తులా అడ్డుపడుతోంది. బొబ్బిలి కోటలా కట్ట, ప్రవాహబలాన్ని తట్టుకుంటూ తరంగ శత్రువులను ఓడించడానికి ప్రయత్నిస్తోంది. హోరా హోరీగా పెరిగిపోతోంది వడి. కట్ట పీకవరకు నీరు వచ్చేసింది.

"లోకాన్ని కాపాడాలి!" కట్ట పట్టుదల
"ఈ లోకాన్ని మింగాలి" కృష్ణవేణి కోపం

హోరు హోరున శబ్దాలు చేస్తూ, మెట్ట పల్లాలను ఏకంచేస్తూ, ఉధృతంగా ఉవ్వెళ్ళూరిపోతోంది ప్రవాహం.

కట్ట సిగ చుట్టివేశాయి నీళ్ళు. వరవడిగా పారుతోంది నదీమతల్లి. కట్ట హృదయాలను బ్రద్దలకొడుతూ, ప్రభలులాగ ఎదిగిపోతున్నాయి కెరటాలు.

భళ్ళుమని పెద్ద శబ్దం.
కట్ట తెగిపోయింది.

కదిలిపోతున్నాయి కెరటాలు. వడిపడిగా ముందుకు ముసురిపోతున్నాయి ప్రవాహాలు. గాఢ సుషుప్తిలో మునిగిన లోకం కళ్ళు తెరిచింది. బొల బొల ఏడ్చింది.

"ఒరేయి రామయ్యా! ఒరేయి పోలప్ప! ఒరేయి వీరన్న! లేవండి లేవండి! కృష్ణవేణమ్మ కదిలింది. కళ్ళు తెరవండి. ప్రాణంమీదకు వస్తోంది."

నాల్గువైపులా విషాద నాదాలు పెల్లుబికాయి. అంతా బిల బిల లేచారు. వల వల వాపోయారు.

ప్రవాహం కదిలి పోలేదు. పోను పోను పెరిగిపోయింది. ఇళ్ళమీదకు దూసుకువస్తోంది.

ఇళ్ళు మునిగిపోతాయి! ఆలస్యంచెస్తే ప్రాణాలు దక్కవు. పరుపులెత్తండి. కనకదుర్గమ్మ కాళ్ళమీద పడండి. గంగమ్మతల్లికి చేతులెత్తి దణ్ణాలు పెట్టండి.

ఎవరినోటనుంచి వచ్చినా ఇవే మాటలు! ఎవరి హృదయంలోనుంచి వచ్చినా ఒకటే రోదన.

పూరి పాకలను చుట్టేస్తున్నాయి నీళ్ళు. చావు బ్రతుకుల మధ్య చరలాడే విషాద పరిదగ్ధ జీవితాలతో చెలగాట మాడుతోందా వరవడి.

"అమ్మో ! నీళ్ళు" భయంతో వణికిపోతోంది మూడు పాతికలు నిండిన ముసలమ్మ.

ఇంకా ఇంట్లో ఏంచేస్తున్నావు ?" భుజంమీద వేసుకుని పోయాడు యువకుడు.

తలదాచుకుందామని గుడిసెను నిర్మించుకుంది ఆశ.... కన్నీటి కెరటాలతో గుడిసెను ముంచేసింది నిరాశ.

"ఇది నా ఇల్లు....నా జీవితం....ఎవరొచ్చిన, ఎవ రెదురొచ్చిన్నా కదలను" ఆ ఇంటికి ఋణపడినట్లు, ఆ ఇంటిని కాటేసుకొని ప్రాణమీద ఆశను వదిలిపెట్టుకొని కూర్చున్నా డొకడు.

"ఈ ఇల్లు నీదే! ఇప్పుడు ఎవరు కాదన్నారు. ముందుకే ప్రవాహంలో కొట్టుకొని పోతావు" బల వంతంగా అతని బయటకు లాక్కొని వచ్చారు.

విసురు తగ్గలేదు. వడివేగం పెరిగిపోయింది. పూరి పాకలు మునిగిపోయాయి.... పేదహృదయాలు పగిలి పోయాయి....

నోరులేని ప్రాణులు నోరు తెరుచుకొని బావురమని విలపిస్తున్నాయి. పట్లుతెంపుకొని పారిపోడానికి మార్గాన్ని వెతుక్కుంటున్నాయి. సామాన్లను విడువలేక విడవలేక బయటకు వచ్చేవారు కొంత మంది. కష్టార్జితాన్ని వెంట బెట్టుకొని. ప్రాణాలతో గట్టుకెక్కేవారు మరి కొంత మంది.

కృష్ణమ్మ తల్లికి మ్రొక్కుకుంటున్నారు.

"నీ కడుపు చల్లగుండాలి. చల్లనీ తల్లి.... మా మీదా దయచూపమమ్మ ! మమ్మల్ని రక్షించి కాపాడు మమ్మ !"

ఒడ్డునుంచి కొబ్బరికాయలు కొట్టి, ప్రవాహంలోనికి విసురుతున్నారు ముత్తైదువులు. చాల వరకు ఇళ్లు మునిగి పోయాయి.... మట్టి గూళ్లు కూలిపోయాయి....గట్టి ఇళ్లు నీళ్ళ మధ్య నిలబడ్డాయి....పడవలు వేశారు....సామాన్లు మిట్ట మీదకు చేరుస్తున్నారు.

"ఎప్పుడూ రాలేదు. తల్లికెందుకు కోపం వచ్చిందో?" ముసలమ్మ మనవడ్ని అడిగింది.

"కలియుగం మామ్మా !" మనువడు చదువుకున్న తెలివిని భద్రపరచాడు.

క్షేత్రమ్మ గొంతులో తీర్థం పోస్తుంది కృష్ణమ్మ. పొలాలు కడుపులు నిండాయి. పంటలు పండాయి. ఆకలి తీరింది. ఆనందం అందింది.

పంటలను పండించే తల్లి
మానవులను బ్రతికించే తల్లి,

కోపం వచ్చింది. బుసలుకొడుతూ నాగుబాములా భూమిమీద జారిపోతూ, కాటువేయబోయింది. వేస్తోంది. తట్టుకుందేదేలా ? పట్టువిడిపించేదేలా ? మార్గంలేదు. నివాసులు స్థావరాలు విడిచిపెడుతున్నారు. దారిలేదు. నిరాధారులై నీడ కోసం వెదుక్కుంటున్నారు. పడవలు నీటిమీద తేలుతున్నాయి. ప్రాణాలను భద్రంగా ఒడ్డుకు చేరుస్తున్నాయి.

"బ్రతుకు జీవుడా !" అంటూ బయటపడుతున్నారు జనం.

లంక గట్టుమీద ప్రజలు పెరిగిపోతున్నారు. వింతగా. విడ్డూరంగా వరదను పరిశీలిస్తున్నారు.

"ఈ నీరంతా ఎట్లాగవచ్చింది ?" వాళ్ళల్లోవాళ్ళు ప్రశ్నలు వేసుకుంటున్నారు. సమాధానంరాక సతమత మవుతున్నారు. మట్టిగోడలన్నీ నాని నాని, ఒక్కసారి కూలిపోయిందొక పూరి గుడిసె. ఒడ్డునుండి చూస్తున్న పేదజీవి "నాజీవితం కూలిపోయింది" విషాదవదనంతో జాలిగా బాధగా కృష్ణమ్మవేపు కళ్ళు పెద్దవిచేసే చూస్తున్నాడు.

"ఏది శాశ్వితం. తనువులే శాశ్వతం కానప్పుడు, స్థిరంలేని ఇంటికోసం ఎందుకు బాధ పడటం?" ఖరీదైన కారులో కూర్చుని సానుభూతి వాక్యాలు చెబుతూ తనలో తాను నవ్వుకుంటున్నాడు శ్రీమంతుడు. భగ్నజీవికి వళ్ళు మండింది.

"అసలే ప్రాణాలుపోతూ చస్తుంటే అడ్డుగా వీళ్ళంతా దేనికి !" నీళ్ళలో యీదుకుంటూ శ్రీరామ విగ్రహాన్ని హృదయానికి హత్తుకొని జనసందోహాన్ని దూసుకు వచ్చాడు యువకుడు. కారులోవున్న ధనవంతుడి ముఖం చిట్లించుకున్నాడు. తెల్లబోయి చూశాడు,

చెట్లు చేమలు కూలిపోతున్నాయి.
పట్లు పుట్టలు నీటిలో కరిగిపోయాయి
వడివిరగలేదు వేగం తరగలేదు.

కృష్ణ లంకంతా చెరువయి పోయింది. తేలికైన కొం

పలు నీటిలో తేలిపోతున్నాయి. బరువైన మేడలు నీటిలో మునిగి పోతున్నాయి.

ఒకప్పుడు కృష్ణలంక వాసస్థలం. ఇప్పుడు ఒక మహా నదయి పోయింది.

"నది ఒడ్డున ఇళ్ళు ఎవరు కట్టుకోమన్నారు ఇటు వంటి అపదలు వస్తాయని తెలుసుండి కూడా!" భవిష్యత్తును చెబుతున్నాడు కాశ్మీరు శాలువా కప్పుకుంటూ చేతి గీతలు, జీవిత రాతలు పరీక్షించే ఓ మేధావి.

"తలదాచుకోడానికి చోటులేకపోతే ఏం చేస్తాం? అయినా, తల్లికీవిధంగా కోపం వస్తుందనుకున్నామా?" భుజంమీదనుంచి జారిపోతున్న సామాన్ల సంచీని పైకి లాక్కుంటూ, బురదలో కసకస తొక్కుకుంటూ అచ్చటనుంచి కదిలి వెళ్ళి పోయాడొక నడివయస్సులో వున్న పురుషుడు.

"కట్టుదిట్టంగా కదలని కట్టవేసి నట్లయితే యింత ఉపద్రవం సంభవించేది కాదు." ఒక సాంకేతికవేత్త తదేకంగా ప్రవాహం వంక చూస్తు అన్నాడు.

"ఈ పంచవర్ష ప్రణాళికలు వచ్చిన తర్వాత, దేశం దినదిన ప్రవర్థమాన మవుతుందంటున్నారు. మరి ఈ వరదలు అరికట్టే మార్గాలు గురించి ఆలోచించడంలేదా?" సాంకేతిక వేత్తను అడిగాడు ప్రపంచ విషయాలను కొంచెం కొంచెం అర్థంచేసుకోడానికి ప్రయత్నంచేస్తున్న ఆశావాది.

"పనులు నిమ్మది నిమ్మదిగా జరుగుతాయి. కంగారు పడితే లాభంలేదు." అచ్చటనుంచి ముందుకు నడచివెళ్ళి పోయాడు సాంకేతి వేత్త.

"జరిగినట్లే!" తనలో తాను గొణుక్కున్నాడు ఆశావాది నిస్పృహను కనబరుస్తూ, చంటిపిల్లలు కేరు మంటున్నారు. తల్లులు పిల్లలను గుండెల కదుముకొని, కసిగా కృష్ణవేణి కోపాన్ని తిలకిస్తున్నారు. గర్భిణీస్త్రీలు నీళ్ళలో తడుస్తూ బాధను బరువుగా వేసుకొని బయట పడ్డారు.

ఒకసారి కృష్ణవేణి కనకదుర్గ పందెంవేసుకున్నాయట

"నీకొండ మీదికివచ్చి, నీ నత్తు అందుకుంటాను" కనకదుర్గనుచూచి అందట.

"ఏవిధంగా అందుకుంటావో చూస్తాగా!" కనకదుర్గ నవ్వుతూ సమాధాన మిచ్చిందట.

ఎక్కడ కనకదుర్గకొండ. ఎక్కడకృష్ణ. కృష్ణకొండ అందుకుంటే. కలియుగం అంతమవుతుందేమో? అంత పని కనకదుర్గ చేయనిస్తుందా?? తన పిల్లలను కాపాడుకుంటుంది కనకదుర్గమ్మ. చల్లని తల్లి.

కృష్ణవరద గురించి తర్జన భర్జనలు పడుతున్న ప్రేక్షకులు పల్చబడి పోయారు. వరద వస్తూనేవుంది.

కృష్ణవేణి విరగబడే తగరల మెరపు చాటున ఢమర నాదం లేదిప్పుడు.

కృష్ణవేణి తరంగాల మీద నృత్యంచేసే సంధ్యాంగనా పదవిన్యాసం లేదిప్పుడు.

నురుగలు కక్కే ప్రవాహం
పరుగులు వేసే జలపాతం

